

# పుష్ప 2 రిలీజ్ వాయిదా?



**విశ్వంభర, సినిమా :** ఈ ఏడాది మోస్ట్ అవైటెడ్ మూవీస్‌లో అల్లు అర్జున్ నటిస్తోన్న 'పుష్ప 2' కూడా ఒకటి. ఆగస్ట్ 15న విడుదల కానున్న ఈ క్రేజీ పాన్ ఇండియా సినిమా కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. సుకుమార్ తెరకెక్కిస్తోన్న ఈ సినిమాలో అల్లు అర్జున్ సరసన రష్మిక మందన్న హీరోయిన్ గా నటిస్తోంది. 'మైత్రి మూవీ మేకర్స్' సంస్థ భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ సినిమాను నిర్మిస్తోంది. తాజాగా అనసూయ పుట్టిన రోజు సందర్భంగా పుష్ప 2 లో ఆమె లుక్ ను కూడా రివీల్ చేశారు మేకర్స్. ఇదిలా ఉంటే 'పుష్ప 2' రిలీజ్ డేట్ గురించి పలు గాసిప్‌లు వినిపిస్తున్నాయి . కొన్ని నెలల క్రితం ఈ సినిమా విడుదల తేదీపై పుకార్లు వచ్చాయి.తాజాగా పుష్ప 2 సినిమా ఎడిటర్‌లో మార్పు వచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. ఆంటోనీ రూబెన్ డేట్స్ విషయంలో సమస్యలు రావడంతో ఆయన ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నట్లు సమాచారం. మరోవైపు ఎడిటింగ్ బాధ్యతలను పూర్తి చేయడానికి నవీన్ నూలిని ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటనైతే రాలేదు. కానీ రిలీజ్ డేట్ వాయిదాపై అనుమానం రావడానికి ఇదే మొదటి కారణం. 'పుష్ప 2' షూటింగ్ ఇంకా పూర్తి కాకపోవడం రెండో కారణం. రిపోర్ట్స్ ప్రకారం, అల్లు అర్జున్ ఈ సినిమా షూటింగ్ మే నెల అంతా ఉంటుంది. మిగిలిన సన్నివేశాలను కూడా జూన్ నెలలో చిత్రీకరిస్తారని సమాచారం. అందుకే ఆగస్ట్ 15కి పుష్ప 2 సినిమా రెడీ అవుతుందా లేదా అన్న సందేహం చాలా మందిలో నెలకొంది.



## లవ్ మీ

**విశ్వంభర, సినిమా :** దిల్ రాజు వారసుడు యువ హీరో ఆశిష్, బేబీతో బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన వైష్ణవి చైతన్య జంటగా 'లవ్ మీ' సినిమా రాబోతున్న సంగతి తెలిసింది. దిల్ రాజుమప్రొడక్షన్స్ బ్యానర్ లో హన్షిత రెడ్డి, హర్షిత్ రెడ్డి నిర్మాణంలో అరుణ్ దర్శకత్వంలో 'లవ్ మీ' సినిమా తెరకెక్కుతుంది. దెయ్యంతో హీరో ప్రేమాయణం అనే ఆసక్తికర కథాంశంతో ఈ సినిమా ఉండబోతుంది అని తెలుస్తుంది. అందుకే లవ్ మీ టైటిల్ కి ఇఫ్ యూ డేర్ అనే క్యాప్షన్ కూడా ఇచ్చారు. తాజాగా ఈ సినిమా నుంచి ట్రైలర్ విడుదల చేశారు. ట్రైలర్ ఆద్యంతం ఆసక్తిగా సాగింది. హీరో ఓ దయ్యాన్ని వెతుక్కొని వెళ్లి, ఆ దయ్యాన్ని ఎలా ప్రేమలో పడేస్తాడు, అందర్నీ చంపేసే దయ్యం హీరోని వదిలేస్తుందా అనే ఆసక్తికర అంశంతో ట్రైలర్ సాగింది. హారర్ థ్రిల్లర్ జానర్ లో ఈ సినిమా ఉండబోతుంది. ఇక ఈ సినిమా మే 25న రిలీజ్ కానుంది. ఈ సినిమాలో సిమ్రాన్ చౌదరి, రవికృష్ణ.. పలువురు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. అలాగే ఈ సినిమాలో వైష్ణవి, సిమ్రాన్ కాకుండా ఇంకో ముగ్గురు హీరోయిన్స్ గెస్ట్ అప్పీరెన్స్ ఇచ్చినట్టు సమాచారం. ఇందులో దయ్యం పాత్రని కూడా ఓ హీరోయిన్ తో వేయించినట్లు తెలుస్తుంది.

## కాజల్ అగర్వాల్ కోసం కీరవాణి సాహసం

**విశ్వంభర, సినిమా :** కాజల్ అగర్వాల్ పెళ్లి తర్వాత అడపాదడపా సినిమాలు చేస్తున్న సంగతి తెలిసిందే. త్వరలో కాజల్ అగర్వాల్ లేడీ ఓరియెంటెడ్ గా చేసిన సత్యభామ సినిమా రిలీజ్ కాబోతుంది. ఇప్పటికే ఈ సినిమా గ్లింప్స్, సాంగ్ రిలీజ్ చేసి ఆసక్తి పెంచారు. తాజాగా సత్యభామ సినిమా నుంచి మరో పాటని విడుదల చేశారు. హైదరాబాద్ లో సత్యభామ మ్యూజికల్ ఈవెనింగ్ నిర్వహించి 'వెతుకు వెతుకు..' అనే పాటని రిలీజ్ చేశారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్లో మ్యూజిక్ డైరెక్టర్ శ్రీ చరణ్ పాకాల, అండ్ టీమ్ లైవ్ ఆర్కెస్ట్రాలో పాటలతో అదరగొట్టారు. ఈ పాటని చంద్రబోస్ రాయగా శ్రీచరణ్ పాకాల సంగీత దర్శకత్వంలో కీరవాణి పాడటం విశేషం. అమ్మాయిలపై జరుగుతున్న హత్యాయత్నాల నేపథ్యంలో.. బాధిత యువతులను చూసి, నేరస్తులను పట్టుకోవడానికి పోలీసాఫీసర్ సత్యభామ ప్రయత్నిస్తున్న నేపథ్యంలో సినిమాలో ఈ సాంగ్ వస్తుందని తెలుస్తుంది.




## రిటైర్మెంట్ తర్వాత ఎవ్వరికీ కనిపించను

● విరాట్ షాకింగ్ కామెంట్స్ ● ఆందోళనలో ఫ్యాన్స్!

**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తన రిటైర్మెంట్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. కెరీర్‌కు గుడ్‌బై చెప్పిన తర్వాత తన ప్లాన్స్ గురించి వెల్లడించాడు. రిటైర్మెంట్ తర్వాత కొంతకాలం ఎవరికీ కనిపించనని అన్నాడు. ప్రస్తుతం ఐపీఎల్‌లో బిజీగా ఉన్న విరాట్ రీసెంట్‌గా ఆర్సీబీ రాయల్ గలా డిన్నర్ ప్రోగ్రామ్‌లో ఈ వ్యాఖ్యలు చేశాడు. 'ఓ క్రీడాకారుడిగా మాకు కెరీర్ ముగించాల్సిన రోజు ఒకటి ఉంటుంది. నేను కూడ ఎప్పటికీ ఇలాగే ఆడలేను. నాకు ఇప్పటికైతే కెరీర్ పరంగా ఎలాంటి రిగ్రెట్స్ లేవు. 'ఫలానా రోజు ఇలా చేసి ఉంటే బాగుండేది' అనుకుంటూ కెరీర్‌ను ముగించడం నాకు ఇష్టం లేదు. చేయలేని దాని గురించి ఎక్కువగా ఆలోచించకుండా ముందుకెళ్తా. ఇక ఏదో ఒకరోజు నేను కూడా ఆటకు ముగింపు పలుకుతా. ఆ తర్వాత కొంతకాలం మీకు ఎవరికీ నేను కనిపించను. అందుకే ఆడినన్ని రోజులు బెటర్ పెర్ఫార్మెన్స్ ఇవ్వడానికే ప్రయత్నిస్తా. అదే నన్ను ముందుకు నడిపిస్తోంది' అని విరాట్ అన్నాడు. దీంతో ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు. తొందరలో ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని కోరుతున్నారు.

## ఫుట్‌బాల్‌కు సునీల్ ఛెత్రి గుడ్‌బై

- రిటైర్మెంట్ ప్రకటించిన భారత ఫుట్‌బాల్ టీమ్ కెప్టెన్
- జూన్ 6న కువైట్‌తో జరగనున్న మ్యాచ్‌నే చివరిదంటూ ప్రకటన
- భారత్ తరఫున 150 మ్యాచ్‌ల్లో 95 గోల్స్
- ప్రపంచంలో అత్యధిక గోల్స్ చేసిన లిస్ట్‌లో ఛెత్రి నాలుగో స్థానం



**విశ్వంభర, స్పోర్ట్స్ :** భారత ఫుట్‌బాల్ టీమ్ కెప్టెన్ సునీల్ ఛెత్రి ఆటకు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఫిఫా వరల్డ్‌కప్‌లో జూన్ 6న కువైట్‌తో జరగనున్న క్వాలిఫైయింగ్ మ్యాచ్ అనంతరం ఇంటర్నేషనల్ ఫుట్‌బాల్ నుంచి తప్పుకోనున్నట్లు గురువారం పేర్కొన్నాడు. ఈ మేరకు 39ఏళ్ల సునీల్ తన నిర్ణయాన్ని సోషల్ మీడియాలో ఓ వీడియో ద్వారా చెప్పాడు. 2005లో ఇంటర్నేషనల్ ఫుట్‌బాల్‌లో కెరీర్ ప్రారంభించిన ఛెత్రి భారత్ తరఫున 150 మ్యాచ్‌ల్లో 95 గోల్స్ చేశాడు.

### అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా..

ఈ క్రమంలో భారత్ తరఫున అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఇక ప్రపంచవ్యాప్తంగా అత్యధిక గోల్స్ చేసిన లిస్ట్‌లో ఛెత్రి నాలుగో స్థానంలో ఉన్నాడు. ఈ జాబితాలో పోర్చుగల్ లెజెండ్ క్రిస్టియానో రొనాల్డో (128 గోల్స్, 205 మ్యాచ్‌ల్లో) టాప్‌లో ఉండగా, ఇరాన్ ప్లేయర్ అలీ డే (108 గోల్స్, 148 మ్యాచ్‌ల్లో) రెండు, అర్జెంటినా స్టార్ లియోనల్ మెస్సీ (106, 180 మ్యాచ్‌ల్లో) మూడో స్థానంలో ఉన్నారు.ఇక అంతర్జాతీయ ఈవెంట్లలో సౌత్ ఆసియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ టోర్నీలో భారత్‌ను రెండుసార్లు (2011, 2015) ఛెత్రి ఛాంపియన్‌గా నిలిపాడు. 2008 ఛాలెంజింగ్ కప్, 2017, 2018ల్లో ఇంటర్‌కాంటినెంటల్ కప్‌ల్లో భారత్‌ను విజేతగా నిలిపాడు. వ్యక్తిగతంగా సునీల్ ఛెత్రి 6 సార్లు ఆల్‌ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ ప్లేయర్‌గా కూడా నిలిచాడు.

### అర్జునా, పద్మశ్రీ:

ఈ లెజెండరీ ప్లేయర్‌కు 2011లో అత్యున్నత క్రీడా పురస్కారం 'అర్జునా అవార్డు' దక్కింది. భారత్‌లో 'ఖేల్‌రత్న' తర్వాత 'అర్జున అవార్డు' రెండో అత్యున్నత క్రీడా పురస్కారంగా ఉంది. ఇక 2019లో భారత ప్రభుత్వం సునీల్ ఛెత్రిని పద్మ శ్రీ అవార్డుతో సత్కరించింది.

### అదే ఆఖరిది:

ఇక ఫిఫా వరల్డ్‌కప్ క్వాలిఫైయర్స్‌లో జూన్ 6న కువైట్‌తో జరగనున్న మ్యాచ్ సునీల్ ఛెత్రికి ఇంటర్నేషనల్ కెరీర్‌లో ఆఖరిది కానుంది. ప్రస్తుతం ఈ టోర్నమెంట్‌లో గ్రూప్‌లో ఉన్న భారత్ 4 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. కువైట్ 3 పాయింట్లతో నాలుగో ప్లేస్‌లో కొనసాగుతోంది.



## ఇంగ్లండ్ క్రికెటర్లపై ఇర్ఫాన్ పఠాన్ తీవ్ర ఆగ్రహం

**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీ20 వరల్డ్ కప్-2024 సమీపిస్తుండడంతో శిక్షణ కోసమంటూ ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) తమ దేశ క్రికెటర్లను ఐపీఎల్ నుంచి వెనక్కి పిలిచింది. దీంతో టీ20 వరల్డ్ కప్‌కు ఎంపికైన ఆ దేశ క్రికెటర్లు జాస్ బట్లర్ (రాజస్థాన్ రాయల్స్), ఫిల్ సాల్ట్ (కోల్‌కతా నైట్ రైడర్స్), విల్ జాక్స్ (రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు), సామ్ కర్రాన్ (పంజాబ్ కింగ్స్) స్వదేశం బయలుదేరారు. ఐపీఎల్‌లో తమతమ జట్లు ప్లే ఆఫ్స్ రేసులో కీలకమైన దశలో ఉన్న సమయంలో ఇంగ్లండ్ ఆటగాళ్లు ఈ విధంగా మధ్యలోనే వెళ్లిపోతుండడంపై టీమిండియా మాజీ స్టార్ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ ఘాటుగా స్పందించాడు. "ఉంటే పూర్తి సీజన్‌కి అందుబాటులో ఉండండి లేదా అసలు రావద్దు!" అంటూ ఎక్స్ వేదికగా పఠాన్ మండిపడ్డాడు. ఐపీఎల్ నుంచి మధ్యలోనే వెళ్లిపోతుండడంపై పఠాన్ ఈ విధంగా తన అసహనాన్ని వ్యక్తం చేశాడు. గత రాత్రి రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్ మధ్య మ్యాచ్ జరగగా ఇంగ్లండ్‌కు చెందిన రాజస్థాన్ స్టార్ ప్లేయర్ జాస్ బట్లర్ అందుబాటులో లేడు. స్వదేశానికి వెళ్లిపోవడమే కారణంగా ఉంది. ఇక ఇంగ్లండ్‌కే చెందిన సామ్ కర్రాన్ పంజాబ్ కింగ్స్ తరఫున చివరి మ్యాచ్ ఆడాడు. అతడు కూడా స్వదేశం వెళ్లిపోనున్నాడు. ఈ నేపథ్యంలోనే ఇర్ఫాన్ పఠాన్ ఘాటు వ్యాఖ్యలు చేశాడు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana.
Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com